



ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మహబూబాబాద్

మంగళవారం 29 అక్టోబరు 2024 | 5



మానుకోటకు మరో అర్బన్ పార్క్





మహబూబాబాద్ శివారులోని హస్తినాపురం సమీపంలో అర్బన్ పార్కు ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేస్తున్న జిల్లా అటవీశాఖ అధికారి విశాల్, ఇతర అధికారులు

- ఆదేశాలు జారీ చేసిన పీసీసీఎఫ్
- 174 ఎకరాల్లో స్థల పరిశీలన
- పార్క్ అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు
- లక్నవరం ఇంజనీర్లతో డిజైన్

నెహ్రూ సెంటర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ సుందరీకరణలో భాగంగా మహబూబాబాద్ జిల్లాకు మరో అర్బన్ పార్కు మంజూరైంది. ఈ మేరకు తెలంగాణ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు(పీసీసీఎఫ్) రాకేష్ మోహన్ డొబ్రియల్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణ సుందరీకరణలో భాగంగా జిల్లా కేంద్రం పర్యాటక కేంద్రంగా ఉండే విధంగా రూ.2కోట్లతో ఆహ్లాదకరమైన వాతావరణంలో అత్యాధునిక హంగులతో అటవీశాఖ ఆధ్వర్యంలో పార్కు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే అటవీశాఖ అధికారులు ఈ దిశగా ఏర్పాట్లు ముమ్మరం చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని హస్తినాపురం శివారు 1207 కంపార్ట్‌మెంట్ పరిధిలోని 174 ఎకరాల్లో స్థల పరిశీలన చేశారు. ఇందులో 134 ఎకరాలను గుర్తించారు. మరో 40 ఎకరాలు పరిశీలనలో ఉంది. ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమించుకుంటే నోటీసులు ఇవ్వడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. మారుమూల ప్రాంతంగా ఉన్న మానుకోట క్రమక్రమంగా మునిసిపాలిటీ, జిల్లా కేంద్రం, పార్లమెంట్ కేంద్రంగా అప్‌గ్రేడ్ అయి దినదినాభివృద్ధి చెందుతోంది. పట్టణ ప్రాంతానికి వచ్చే ప్రజలు కాసింత విశ్రాంతి తీసుకునేందుకు సరైన పార్కు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా అవసరాలను పరిగణలోకి తీసుకుని మరో అర్బన్ పార్కుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే అర్బన్ పార్కుకు ప్రజలు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

అర్బన్ పార్కులో ప్లాంటేషన్లు ఇవే..

మహబూబాబాద్‌కు రూ.2కోట్లతో మంజూరైన అర్బన్ పార్కులో చిల్డ్రన్స్ ప్లే గ్రౌండ్, యోగా మందిర్, రాశివనం, నక్షత్రవనం, రోజ్ గార్డెన్, మెడిషన్ ప్లాంట్స్, ఔషధ మొక్కలు, మాంగళ్య వనం, ఆహ్లాదకరమైన బటర్‌ఫ్లై గార్డెన్, పూల మొక్కలు, అర్బన్ పార్కు విస్తీర్ణాన్ని వీక్షించేలా వాచ్ టవర్‌లను ఏర్పాటు చేయనున్నారు.



మహబూబాబాద్ అర్బన్ పార్క్‌లో ఏర్పాటు చేయనున్న వసతుల ఊహా చిత్రం

పర్యాటకులు సేద తీరేలా...

అర్బన్ పార్కును పర్యాటకులు, జిల్లా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా తీర్చిదిద్దనున్నారు. గతంలో జమాండ్లపల్లి వద్ద రూ.3 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన నందనవనం జిల్లా కేంద్రానికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ప్రజలు అంతదూరం వెళ్లలేకపోయారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా పట్టణ కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, సా యంత్రం వేళల్లో వాకింగ్ చేసే ప్రజలకు ఆహ్లాద కరమైన వాతావరణం కల్పించేందుకు అధికారులు జిల్లాకేంద్రంలో అందరికీ అందుబాటులో ఉండేలా అర్బన్ పార్కును ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

లక్నవరం ఇంజనీర్లతో పార్క్ డిజైన్

ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న

మిగతా 8లో...

పార్క్ ఏర్పాటుకు ప్రజలు సహకరించాలి

బత్తుల విశాల్, జిల్లా అటవీశాఖ అధికారి



మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి మరో అర్బన్ పార్కు మంజూరు అయింది. అటవీశాఖ ఆధ్వర్యంలో సుమారు 174 ఎకరాల్లో ఈ పార్కును ఏర్పాటు చేయనున్నాం. పార్కు ఏర్పాటు కోసం పలుచోట్ల స్థల పరిశీలన చేయడం జరిగింది. అనుకూలంగా ఉండే స్థలంలో పార్కును ఏర్పాటు చేయనున్నాం. ఇందుకు జిల్లా ప్రజలు, అధికారులు సహకరించాలి.

తెలంగాణలో అప్రజాస్వామిక పాలన

- హైదరాబాద్‌లో ధర్నాలు, ఆందోళనలపై ఆంక్షలు
- పూర్తి సాయిలో రైతు రుణమాఫీ ఏది?
- సీపీఎం రాష్ట్ర నేత సుంకరి వీరయ్య

6

గ్రీవెన్స్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో ప్రజలు అందించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 91 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా వెనువెంటనే పరిష్కరించి ప్రజలకు మరింత భరోసా కల్పించాలన్నారు. దరఖాస్తుదారుల సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేయాలని, లేనిపక్షంలో వారికి తగిన సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, అధికారులు నర్సింహమూర్తి, హరిప్రసాద్, నర్సింహస్వామి, డాక్టర్ కిరణ్ కుమార్, నర్మద, బీమ్లానాయక్, సురేష్, మరియన్న, వెంకటరమణ, ప్రేమ్‌కుమార్, కృష్ణవేణి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మానుకోట అదనపు కలెక్టర్‌గా మహేందర్‌జీ



మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ములుగు జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ బదిలీపై వస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 మంది డిప్యూటీ కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలను బదిలీ చేస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.డేవిడ్ ములుగు జిల్లా అదనపు కలెక్టర్‌గా బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో అక్కడ పనిచేస్తున్న సీహెచ్.మహేందర్‌జీ బదిలీపై వస్తున్నారు. అదేవిధంగా జిల్లాలోని తొర్రూరు ఆర్డీవోగా పనిచేస్తున్న జి.నర్సింహారావు ఖమ్మం ఆర్డీవోగా బదిలీపై వెళ్తుండగా, అక్కడ ఆర్డీవోగా పనిచేస్తున్న గుంటిపల్లి గణేష్ తొర్రూరు ఆర్డీవోగా వస్తున్నారు. మహబూబాబాద్ ఆర్డీవోగా పనిచేస్తున్న ఎల్.అలివేలు గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్(జీడబ్ల్యూఎంసీ) సెక్రటరీగా బదిలీపై వెళ్తుండగా, జహీరాబాద్ ఆర్డీవోగా పనిచేస్తున్న ఎస్.రాజు మహబూబాబాద్ ఆర్డీవోగా బదిలీపై వస్తున్నారు.

ఓబీసీ రిజర్వేషన్ల రద్దుకు కుట్ర

- పాలకులపై ఒత్తిడి చేస్తున్న కుహనా శక్తులు
- దీనిని తిప్పికొట్టేందుకు మరో పోరాటం
- త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం
- ఓబీసీ సంఘాల నేతల వెల్లడి
- భవిష్యత్ పోరాటంపై కార్యాచరణకు కసరత్తు



ఐక్యతాభివాదం చేస్తున్న ఓబీసీ సంఘాల నేతలు

హనుమకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు ప్రస్తుతం అమలులో ఉన్న పది శాతం రిజర్వేషన్లను రద్దు చేయించేందుకు కొన్ని కుహనా శక్తులు కుట్ర పన్నుతున్నాయని కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి గంగవరపు రామక్రిష్ణ ప్రసాద్ అన్నారు. సోమవారం హనుమకొండలోని బ్రాహ్మణ భవన్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో రామక్రిష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ కుట్రను తిప్పికొట్టేందుకు ఓబీసీ సంఘాలన్నీ మరో పోరాటానికి సిద్ధమవుతున్నాయని అన్నారు. ఓబీసీ రిజర్వేషన్ల రద్దు కోసం కొందరు ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిని ఓబీసీ సంఘాలు సంఘటితంగా ఎదుర్కోవాలని పిలుపు నిచ్చారు. అనేక రాష్ట్రాలలో అగ్రవర్ణ పేదలకు న్యాయం జరగాలని చేసిన ఓసీ ఉద్యమాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ ద్వారా అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్ కల్పించిందని అన్నారు. వైద్య, విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ కల్పించిందని చెప్పారు. తెలంగాణలో ఈ రిజర్వేషన్ అమలు చేయడానికి రెండేళ్ల పోరాటం చేసిన తర్వాతగాని అమలులోకి రాలేదన్నారు. దీనిని సహించలేని కుహనా మేధావులు ఈడబ్ల్యుఎస్‌ను రద్దు చేయాలని మెమో రాండాలు ఇస్తూ పత్రికా ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. ఈ ధోరణిని ఓబీసీ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు.

తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపు జయపాల్ రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన ఇతర రాజర్వేషన్లకు తాము ఏనాడూ వ్యతిరేకం కాదని, ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లకు భంగం కలిగిస్తే తాము ఎంతటి

మిగతా 8లో...



మహబూబాబాద్ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఓటరు నమోదు చేపడుతున్న పీఆర్టీయూ టీఎస్ నాయకులు

ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేయించుకోవాలి

పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు భద్రినారాయణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతీ ఉపాధ్యాయుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్టీయూ-టీఎస్ జిల్లా అధ్యక్షుడు సంకా భద్రినారాయణ అన్నారు. మహబూబాబాద్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ మెడికల్ కళాశాల, మహాత్మా జ్యోతిరావు పూలే, మైనారిటీ గురుకుల పాఠశాలల్లో సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులైన ప్రతీ ఉపాధ్యాయుడు పేరు నమోదు చేయించుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో కేజీబీవీ, గిరిజన ఆశ్రమ, సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ రావడానికి సంఘం కృషి చేస్తుందన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు, 010 ద్వారా వేతనాలు ఇప్పిస్తుందన్నారు. రాబోయే నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ-టీఎస్ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు గీత, కల్లెం వెంకట్‌రెడ్డి, హల్యానాయక్, లక్ష్మారెడ్డి, రామోజీనాయక్, సుజాత, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇళ్లులేని నిరుపేదల వివరాలు సేకరించాలి

వీసీలో హౌసింగ్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు

మహబూబాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో క్షేత్రస్థాయిలో ఇళ్లు లేని నిరుపేదల వివరాలను పారదర్శకంగా సేకరించాలని హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర స్థాయి ఇంజనీరింగ్ అధికారులు చైతన్య కుమార్, ఈశ్వరయ్య తెలిపారు. హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు(నోడల్ అధికారులు), ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-జీ హౌసింగ్ పథకంపై క్షేత్ర సాయిలో ఎలా సర్వే నిర్వహించాలన్న అంశంపై వివరించారు. ఈ సందర్భంగా హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర స్థాయి ఇంజనీరింగ్ అధికారులు చైతన్య కుమార్, ఈశ్వరయ్య మాట్లాడుతూ... క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించాలన్నారు. పంచాయతీ కార్యదర్శికి లాగిన్ ఐడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. వారు చేసిన సర్వే వివరాల నమోదును ఎంపీడీవో స్థాయిలో రావడం జరుగుతుందని, అక్కడ ఆమోదం తెలిపాక జిల్లా నోడల్ అధికారి సర్వే వివరాలను గుర్తిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియ ఆన్‌లైన్ విధానం ద్వారా జరుగుతుందన్నారు. ఈ వీసీలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, జడ్పీ సీఈవో పురుషోత్తం, డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రాజు, జడ్పీ డిప్యూటీ సీఈవో నర్మద, ఎంపీడీవో సురేష్ పాల్గొన్నారు.

వారంలో మొక్కలు నాటాలి లేదంటే డబ్బులు రికవరీ చేయిస్తాం

ప్రజావేదికలో అదనపు డీఆర్‌డీవో శాంతకుమారి

8



అంతర్జాతీయ అవార్డుకు నృత్య కళాకారిణి ఎంపిక



అలకనంద

మల్హర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని అన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన వర్ధమాన నృత్య కళాకారిణి బానోత్ అలకనంద అంతర్జాతీయ భరతనాట్యం అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు తల్లిదండ్రులు రాజ్ కుమార్, దివ్య తెలిపారు. ఈ పురస్కారాన్ని యూనైటెడ్ నేషన్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ ప్రదానం చేయనుంది. నవంబరు 23న తమిళనాడులో ఊటీలో అలకనంద అందుకోనుందని పేర్కొన్నారు.

పునరావాసం కల్పించాలి

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని ఇంచర్ల గ్రామ శివారులో నిరుపేదలు కొన్నేళ్లక్రితం వేసుకున్న గుడిసెలను తొలగించడం దారుణమని, వెంటనే వారికి ప్రభుత్వం పునరావాసం కల్పించాలని అంబేద్కర్ గుడిసెవాసుల సంఘం అధ్యక్షుడు నాంపెల్లి స్వామి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంచర్ల గ్రామశివారులోని సర్వేనంబర్ 17 లోని ప్రభుత్వభూమిలో ఎనిమిది సంవత్సరాల నుంచి నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని అన్నారు. ఈక్రమంలో ఇళ్ల పట్టాలు అందించాలని పలుమార్లు మంత్రికి, జిల్లా ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారని పేర్కొన్నారు. అయినా ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు దౌర్జన్యంగా గుడిసెలను తొలగించడం అన్యాయమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గుడిసె వాసులకు పట్టాలు అందించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆయన కోరారు.

నకిలీ డీఎస్పీపై కేసు


నకిలీ డీఎస్పీ పూర్ణచందర్

మడికొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డీఎస్పీని అని చెప్పుకుంటూ సెటిల్మెంట్లకు పాల్పడుతున్న బీఎస్ఎఫ్ కానిస్టేబుల్‌పై మడికొండ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన భూపతి హరీష్. తన బంధువులైన భూపతి సురేష్, రమేష్, శ్రీనివాస్‌లకు కొంత కాలంగా నెలకొన్న భూ వివాదం దృష్ట్యా మడికొండ పోలీసులను ఆశ్రయించగా సివిల్ తగాదాగా చెప్పి కోర్టుకు వెళ్లాలని సూచించారు. ఈక్రమంలో భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నవాబుపేట గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ కొక్కుల పూర్ణచందర్ తనకు తానుగా డీఎస్పీ అని చెప్పుకొని పోలీసు యూనిఫామ్‌లో వచ్చి ఈనెల 22న భూపతి హరీష్‌ను భూసెటిల్మెంట్ చేసుకోవాలని బెదిరించాడు. ఈవిషయమై భూపతి హరీష్ మడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హరీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

దేవునిగుట్ట మెట్ల పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, సిబ్బంది

ములుగు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ములుగు మండలం కొత్తూరు దేవునిగుట్టపై జరుగుతున్న అభివృద్ధి పనులను డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్ సోమవారం పరిశీలించారు. స్థానికంగా లభ్యమయ్యే రాళ్లను ఉపయోగించి కిలోమీటర్ పొడవునా గుట్టపైకి మెట్ల మార్గాన్ని నిర్మిస్తుండగా పర్యవేక్షించారు. పనులు పూర్తయిన తర్వాత పర్యాటకులను అనుమతిస్తామని, ట్రెక్కింగ్ సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. ఆయన వెంట ములుగు రేంజ్ అధికారి శంకర్, దేవునిగుట్ట దేవస్థానం పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

రఘునాథపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందడంతో పాటు మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై మండలంలోని కోమల్ల బస్టాండు సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం..కోమల్ల గ్రామానికి చెందిన కొరిపెల్లి లక్ష్మి(70) అనే వృద్ధురాలితో పాటు బండి భారతమ్మ అనే మహిళ చింతలగూడెం వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతోంది. ఈ క్రమంలో జనగామ నుండి హనుమకొండ వైపు వెళ్తున్న కారు ఢీ-కుంది. ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ కొరెపల్లి లక్ష్మి మృతి చెందారు. బారతమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

గిరిజనుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

సెక్టోరియల్ అధికారులతో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా



గిరిజన దర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం రూరల్, అక్టోబరు 28: గిరిజన సమస్యలను సెక్టోరియల్ అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా ఆదేశించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆమె పాల్గొన్నారు. గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు.వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. గిరిజన దర్బార్‌లో వచ్చిన వినతులపై దృష్టిసారించి అలసత్వం వహించకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 22 వినతులు వచ్చాయి. తాను జీఎస్ఎం వృత్తి విద్యా కోర్సు పూర్తి చేశానని, ఏదైనా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎం ఉద్యోగావకాశం కల్పించాలని తాడ్వాయి మండలం గంగారం గ్రామానికి చెందిన గడ్డం రాధిక విన్నవించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు స్కూల్ యూనిఫాం దుస్తులు కుట్టామని, వాటి బిల్లు ఇప్పించాలని గూడూరు మండలానికి చెందిన శ్రీ సమ్మక్క-సారలమ్మ గిరిజన ఆదివాసీ టైలర్స్ సంఘం సభ్యులు ఈసం లలిత, పెనక రాధిక కోరారు. గిరి వికాస పథకం ద్వారా పొలాల్లో బోర్లు వేసి నీటి సౌకర్యం కల్పించాలని తాడ్వాయి మండలం లింగాల గ్రామానికి చెందిన హేమలత విజ్ఞప్తి చేశారు. కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సు పూర్తి చేశానని, ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీ పీఈటీగా ఉద్యోగావకాశం కల్పించాలని ఏటూరునాగారం మండలం ముల్లకట్ట గ్రామానికి చెందిన చీల మౌనిక వేడుకున్నారు. డబుల్ బెడ్‌రూం భవనాలకు సంబంధించిన చివరి బిల్లులు ఇప్పించాలని గోవిందరావుపేట మండలానికి చెందిన అజ్మీరా శాంత, సమ్మక్క, శారద వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతిపత్రం సమర్పించిన నిర్వాసితులు


మంత్రి శ్రీధర్‌బాబుకు సమస్యను వివరిస్తున్న బాధితులు

మల్హర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : ఓపెన్‌కాస్టులో జరిగే బ్లాస్టింగులతో ఇబ్బందులు పడుతున్నామని, డేంజర్ జోన్‌లో ఉన్న తమను ఇళ్లకు పరిహారం చెల్లించి సురక్షిత ప్రాంతానికి తరలించాలని తాడిచర్ల గ్రామస్థులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కోరారు. పెద్దపల్లి జిల్లా మంథనిలో సోమవారం పర్యటించిన మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఓసీ ప్రారంభమై ఏడేండ్లు గడుస్తున్నా తమను సురక్షిత ప్రాంతానికి తరలించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఓసీపీలో నిత్యం జరిగే బ్లాస్టింగ్లతో ఇళ్లు బీటలు బారుతున్నాయని, విషవాయువులు వెలువడి అనారోగ్యపాలవుతున్నామని తెలిపారు. ఓసీ వల్ల వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు కేశారపు రవి, సభ్యులు తాండ్ర సంతోష్, పులిగంటి శారద, ఇందారపు ఎల్లయ్య, రాజపోచయ్య తదితరులు పాల్గొన్నారు.

పీసీ ఘోష్‌కు మహారాష్ట్ర రైతుల లేఖ

మేడిగడ్డ బ్యారేజీతో నష్టపోయామని ఆవేదన

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషన్ చైర్మన్ పినాకి చంద్రఘోష్‌కు మహారాష్ట్ర రైతులు సోమవారం లేఖ రాశారు. మేడిగడ్డ బ్యారేజీతో మహారాష్ట్ర వైపు నష్టపోతున్న ముంపు భూములను గుర్తించడంలో అలసత్వం వహించి తమకు అన్యాయం చేసిన తెలంగాణ, మహారాష్ట్ర అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బ్యారేజీలో పూర్తి స్థాయిలో నీటిని నింపితే మహారాష్ట్ర వైపు మరో 400 ఎకరాల వరకు పంట భూములు నీట మునుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముంపు భూముల వివరాలను తప్పుగా చూపిస్తూ అధికారులు చేసిన సర్వేతోపాటు పరిహారం చెల్లింపులోనూ జాప్యం వహించారని పేర్కొన్నారు. దీంతో తామంతా ఆందోళనలకు దిగడంతో మహారాష్ట్ర ప్రభుత్వమే పరిహారం ఇచ్చిందని తెలిపారు. బ్యారేజీలో నీటినిల్వ 100 ఎఫ్ఆర్ఎల్ చేరితే అదనంగా ముంపునకు గురయ్యే భూముల సర్వే, పరిహారంపై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టతనివ్వకుండా తమ జీవితాలతో ఇరురాష్ట్రాల ప్రభుత్వాలు చెలగాట మాడు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టుపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో మహారాష్ట్ర వైపు ముంపునకు గురవుతున్న భూములు, పరిహారంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పీసీ ఘోష్‌కు లేఖ రాసిన మహారాష్ట్ర రైతు లు భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలోని పోస్టాఫీసులో రిజిస్టర్ పోస్టు చేశారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర రైతులు తిరుపతి ముదం, రాంప్రసాద్ రంగువార్, శ్రీనివాస్ రిక్కుల, సంతోష్ రిక్కుల, రమేష్, మాంతయ్య, పద్మ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


పీసీ ఘోష్ కమిషన్‌కు రాసిన లేఖతో మహారాష్ట్ర రైతులు

హామీలను మరిచిన కాంగ్రెస్

జనగామ రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆశవర్కర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో ప్రభుత్వం పూర్తి విఫలమైందని ఆశ వర్కర్ల యూనియన్(బీఆర్‌టీయూ-అనుబంధం) రాష్ట్ర అధ్యక్షురాలు రావుల సంతోష అన్నారు. మండలంలోని యశ్వంతపూర్ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆశా కార్యకర్తల జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వేముల నర్సింగం మాట్లాడుతూ ఆశలు చేస్తున్న సేవలను గుర్తించి వేతనాలను పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆశలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. ఆశవర్కర్ల సమస్యల పట్ల ఆశలందరూ ఏకమై ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శోభ, విజయ, మంజుల, రజిత పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సంతోష

అధికారులా.. మజాకా ?


ప్రజావాణిలో ఫోన్లలో బిజీగా ఉన్న అధికారులు

ప్రజల సమస్యలను ఆలకించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహ రించారు. దర్జాగా సెల్‌ఫోన్‌లో బిజీ అయిపోయి జనం గోడును పట్టించుకోలేదు. భూపాలపల్లి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఈ దృశ్యం కనిపించింది. కలెక్టర్ రాహుల్ శర్మ సమక్షంలోనే ఆయా శాఖల అధికారులు అలసత్వం ప్రదర్శించారు. ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకుంటుండగా వాటిని ఆలకించి, పరిష్కారంపై దృష్టిసారించాల్సిన అధికారుల్లో కొందరు సెల్‌ఫోన్‌ను చూసుకుంటూ కాలక్షేపం చేయగా, మరికొందరు ఫోన్‌లో పిచ్చాపాటి మాట్లాడుతూ కనిపించారు.

- భూపాలపల్లి కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన

- హైదరాబాద్‌లో ధర్నాలు, ఆందోళనలపై ఆంక్షలు
- పూర్తి సాయిలో రైతు రుణమాఫీ ఏది?
- సీపీఎం రాష్ట్ర నేత సుంకరి వీరయ్య

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన కొనసాగుతోందని, ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుంకరి వీరయ్య అన్నారు. ప్రజా ఉద్యమాలకు సీపీఎం నాయకత్వం వహిస్తుందని చెప్పారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం భవనంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వీరయ్య మాట్లాడుతూ...

హైదరాబాద్ నగరంలో పోలీసులు ప్రమాదకరమైన ఆదేశాలు జారీ చేశారని, అది ప్రజాస్వామ్య విరుద్ధమని చెప్పారు. రాష్ట్ర రాజధానిలో ధర్నాలు, సభలు, సమావేశాలు, ఆందోళనలు చేయవద్దని, కేవలం ఇందిరా పార్కు వద్ద పోలీసుల అనుమతితో చేయాలని, ప్రభుత్వాన్ని విమర్శించేది లేదని ఆంక్షలు పెట్టడం దారుణమన్నారు. మనం ఏ పాలనలో ఉన్నాం.. పోలీస్ రాజ్యాంలో ఉన్నామా.. లేక ప్రజాస్వామ్యంలో ఉన్నామా అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా ప్రజలకు ధర్నాలు చేసే హక్కు ఉంటుందని, దానిని హరిస్తే ప్రజాస్వామ్య హక్కులను కాలరాసినట్టేనని అన్నారు. ప్రభుత్వం తప్పుడు జీవోలు ఇవ్వడం వల్ల గ్రూప్-1 అభ్యర్థులు, పోలీసుల కుటుంబాలు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అహంకార పూరిత ధోరణిని అవలంబిస్తే ప్రజలు ఇంటికి పంపారని ఆయన గుర్తుచేశారు.

పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు ఏది ?

రాష్ట్రంలో ఆగస్టు 15 కల్లా పూర్తి స్థాయిలో రైతులందరికీ రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేస్తానని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.17 వేల కోట్లు చేశామని సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, మిగతా రైతులు ఏం పాపం చేశారని సీపీఎం రాష్ట్ర నేత సుంకరి వీరయ్య ప్రశ్నించారు. రైతు భరోసా గాలిలో కలిసి పోయిందని, ఆరు గ్యారంటీలు అటకెక్కాయని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏ ఒక్క గ్యారంటీ అమలు కాలేదని విమర్శించారు. పేదల ఇంటి స్థలాల కోసం సీపీఎం పోరాడుతుందని పేర్కొన్నారు. ప్రజల హక్కులను కాలరాసే కుట్రలు ప్రభుత్వం చేస్తుందని, దానిని పునరాలోచన చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు తప్పవన్నారు. ఈ సమావేశంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, ఆకుల రాజు, శెట్టి వెంకన్న, గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య, కందునూరి శ్రీను పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుంకరి వీరయ్య


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించి అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి జిల్లా, మండల అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సర్వేను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సర్వే కోసం 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్, డేటా ఆపరేటర్‌ను నియమించామన్నారు. 10 మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్, ప్రతి మండలానికి నలుగురు నోడల్ అధికారులు ఉంటారన్నారు. మండల నోడల్ అధికారులను మానిటరింగ్ చేసేందుకు జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రశ్నావళికి అనుగుణంగా ప్రతి కుటుంబ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ తదితర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను పొందుపరచాలన్నారు. గడువులోగా సర్వే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, సుశీల, ఆర్డీవోలు కొమురయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలి

వెంకటాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో గిరిజనేతరుల వలసలను అరికట్టాలని, వారు అక్రమంగా చేపట్టిన బహుళ అంతస్తుల నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, షాపింగ్ కాంప్లెక్స్‌లపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు తాటి రాంబాబు, సున్నం గోపాల్, పూనెం సూర్యం, బొగ్గుల పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రైలులో నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


పట్టాలపై మృతి చెందిన వ్యక్తి

కేసముద్రం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం మండలం ఇంటికన్నె రైల్వేస్టేషన్ సమీపంలోని శివాలయం ప్రాంతంలో 416/17-19 కిలోమీటరు వద్ద రైల్వే ట్రాక్‌పై సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు వరంగల్ జీఆర్‌ఎస్ హెడ్ కానిస్టేబుల్ గంగధరి సుదర్శన్ తెలిపారు. రాత్రి వేగంగా వెళుతున్న రైలులో నుంచి సుమారు 55 ఏళ్ల వ్యక్తి రెండు ట్రాక్‌ల మధ్యన పడిపోయి కంకర రాళ్లకు కొట్టుకోవడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లుగా భావిస్తున్నట్లు చెప్పారు. మృతుడు నీలిరంగు జీన్స్ ప్యాంటు, నీలి, ఎరుపు గల్లతో కూడిన చొక్కా ధరించి ఉన్నాడన్నారు. మృతుడి వద్ద ఇతర వివరాలేవీ లభ్యం కాలేదని తెలిపారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్, 9701747014 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రాడ్‌తో పొడుచుకున్న యువకుడి..

- ఇంటికన్నెలో ఘటన
- మృతుడిది అస్సాం రాష్ట్రం


డుఖుగర్ (34)

కేసముద్రం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం మండలం ఇంటికన్నె రైల్వేస్టేషన్ సమీపంలో ఇనుపరాడ్, బీరు సీసాతో పొడు చుకొని వీరంగం సృష్టించిన అస్సాం రాష్ట్రం శివసాగర్ జిల్లా అమ్‌గూరి గ్రామానికి చెందిన డుఖుగర్ (34) యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ మురళీ.దర్‌రాజ్ తెలిపారు. ఈ యువకుడు ఈనెల 25న ఇంటికన్నె రైల్వేస్టేషన్‌లో దిగాడు. మతిస్థిమితం లేని వాడిగా ప్రవర్తిస్తూ ఇనుపరాడ్, బీరు సీసాతో తనకు తానే పొడుచుకున్నాడు. రాయిని తీసుకొని దగ్గరకు వచ్చేందుకు ప్రయత్నించిన వారిని కొట్టబోయాడు. పోలీసుల సహాయంతో అతికష్టం మీద సదరు యువకున్ని పట్టుకొని 108లో మహబూబాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు అస్సాంలోని మృతుడి కుటుంబానికి సమాచారం అందించామని ఎస్‌ఐ వివరించారు.

విద్యుదాఘాతంతో ఒకరు..


యాదగిరి (ఫైల్)

తరిగొప్పుల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా తరిగొప్పుల మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై భవనం నుంచి కింద పడి మృతి చెందిన సంఘటన సోమవారం హైదరాబాద్‌లోని మియాపూర్‌లో చోటు చేసు కుంది. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన శివరాత్రి యాదగిరి(48) ఏడేళ్ల క్రితం ఉపాధికోసం హైదరాబాద్ వలస వెళ్లి జగద్గిరుగుట్టలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసముంటున్నాడు. యాదగిరి భవన నిర్మాణ పనులకు కావాల్సిన ఇటుక, ఇసుక, డస్టు సరఫరా గుత్తేదారుగా పనిచేస్తుండేవాడు. ఈ క్రమం లో సోమవారం ఆయన మియాపూర్ పరిధిలోని మయూరినగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌కు లిఫ్టు సహాయంతో ఇటుకలు సరఫరా చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై నాలుగో అంతస్థు నుంచి కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడన్నారు. యాదగిరికి భార్య, ఇద్దరు కుమారులు ఓ కుమార్తె ఉన్నారు.

కుమారుడి వస్త్ర దుకాణం దగ్ధం

- గుండెపోటుతో తండ్రి మృతి


లక్ష్మీనారాయణ (ఫైల్)

జనగామ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కొడుకు వస్త్ర దుకాణం అగ్నిప్రమాదంలో దగ్ధం కావడంతో తండ్రి మనస్తాపం చెంది గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన జనగామ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగింది. ఆదివారం తెల్లవారుజామున జనగామలోని ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని బట్టల దుకాణాలు దగ్ధమయ్యాయి. షాపింగ్ కాంప్లెక్స్‌లోని విజయ, శ్రీలక్ష్మీ షాపింగ్ మాళ్లు, ఎస్ఆర్ బ్రదర్స్ బట్టల దుకాణం పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో ఎస్ఆర్ బ్రదర్స్ బట్టల దుకాణం యజమానికి స్వర్గం శ్రీనివాస్‌కు రూ.70 లక్షల వరకు నష్టం వాటిల్లింది. కాగా.. షాప్ దగ్ధం కావడంతో దుకాణ యజమాని శ్రీనివాస్‌ను బంధువులు, చుట్టుపక్కన వారు పరామర్శిస్తూ ఉన్నారు. ఈ క్రమంలో కొడుకు ఆర్థికంగా నష్టపోవడం చూసి శ్రీనివాస్ తండ్రి లక్ష్మీనారాయణ(77) ఆదివారం రాత్రి నుంచి తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఛాతిలో నొప్పిగా ఉందంటూ ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతి చెందాడు. కొడుకు పరిస్థితి చూసి మనోవేదనతో గుండెపోటుకు గురై మృతి చెందాడని బంధువులు తెలిపారు. కొడుకు శ్రీనివాస్ ఆర్థికంగా నష్టపోగా రోజు గడవముందే తండ్రి మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

• మీ కోసం

సామాజిక పథకాలతో..
సామాన్యుడికి భరోసా



» ప్రధానమంత్రి బీమా పథకాలతో ధీమా
» జన్‌ధన్ యోజనతో మరింత ఆసరా
» అవగాహన కల్పించేందుకు కేంద్రం కార్యాచరణ
» జన్ సురక్ష పేరుతో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బీమా పథకాలు సామాన్యుల బతుకుకు ఓ భరోసాగా కనిపిస్తున్నాయి. జీవిత, ప్రమాద భీమాలతో పాటు జన్‌ధన్ ఖాతాలతో ప్రతి ఒక్క పౌరుడికి ఎంతగానో లబ్ది చేకూరుతోంది. అయితే ప్రధాన మంత్రి బీమా యోజన పేరుతో ప్రవేశ పెట్టిన ఈపథకాలపై అవగాహన లేకపోవడంతో చాలామంది ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. ప్రధానంగా గ్రామీణ స్థాయిలో ఈపథకాలపై అవగాహన లేకపోవడంతో కుటుంబ సభ్యులను పోగొట్టుకున్న వారు ఆర్థిక భరోసాకు దూరమవుతున్నారు. తక్కువ ప్రీమియంతో పెద్ద మొత్తంలో బీమా పొందే అవకాశాన్ని కోల్పోతున్నారు. కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందిస్తున్న సామాజిక భద్రత పథకాలపై ప్రత్యేక కథనం.

తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనం

కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన' ద్వారా బ్యాంకు ఖాతా ఉన్న ప్రతీ పౌరుడు ఈపథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ బీమా పథకంలో చేరాలంటే కనీస వయస్సు 18ఏళ్లు కాగా గరిష్ఠంగా 70ఏళ్ల వరకు వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కసారి రూ.20తో ఈపథకంలో చేరి ప్రతీ ఏడాది అంతే మొత్తంతో చెల్లించి రెన్యువల్ చేసుకుంటూ బీమాను పొందవచ్చు. అయితే పథకం దరఖాస్తు చేసే సమయంలో ఆటో డెబిట్ ఆప్షన్ ఎంచుకుంటే ప్రతీ సంవత్సరం ప్రత్యేకంగా రెన్యువల్ చేసుకోవాల్సిన అవసరం ఉండదు. ఆటోమాటిక్‌గా ప్రీమియం మొత్తం సదరు వ్యక్తి ఖాతా నుంచి కట్ అయి ప్రతీ సంవత్సరం మే నెలలో దానంతటదే రెన్యువల్ అవుతుంది. ఆసమయంలో ప్రీమియం మొత్తానికి సరిపడా సొమ్ము బ్యాంక్ ఖాతాలో నిల్వ ఉంచుకుంటే సరిపోతుంది.

ఈపథకం తీసుకున్న వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించిన లేదా యాక్సిడెంట్ వల్ల పూర్తి అంగవైకల్యం చెందిన రూ.2లక్షల బీమా మొత్తాన్ని నామినీకి అందజేస్తారు. ప్రమాదంలో పాక్షిక అంగవైకల్యం చెందితే సదరు వ్యక్తికి రూ.లక్ష బీమా వర్తిస్తుంది.



మూడు నెలల పాటు అవగాహన కార్యక్రమాలు

కేంద్ర ప్రభుత్వంలోని ఆర్థిక సేవల విభాగం నుంచి ప్రధాన మంత్రి సామాజిక భద్రత పథకాలపై అవగాహన కల్పిస్తూ బీమా కవరేజీ కోసం జన్ సురక్షా పేరిట ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఈ ఏడాది అక్టోబరు 15 నుండి వచ్చే ఏడాది జనవరి 15 వరకు మూడు నెలల పాటు గ్రామాల వారీగా ఆయా బ్యాంకుల పరిధిలోని గ్రామాల్లో బ్యాంకు అధికారులు లేదా బిజినెస్ కరస్పాండెంట్లు ఈపథకాల్లో ప్రత్యేక నమోదు చేయనున్నారు. సామాజిక బీమా పథకాల్లో సేవింగ్స్ ఖాతా ఉన్న ప్రతీ ఖాతాదారుడిని ఇందులో చేర్పడమే లక్ష్యంగా ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నారు.

● కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన' ద్వారా బ్యాంకు ఖాతా ఉన్న ప్రతీ పౌరుడు ఈపథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పథకంలో చేరాలంటే కనీస వయస్సు 18సంవత్సరాలు కాగా గరిష్ఠంగా 50ఏళ్ల వారి వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. సంవత్సరానికి రూ.436తో ఈపథకంలో చేరి ప్రతీ సంవత్సరం అంతే మొత్తంతో రెన్యువల్ చేసుకుంటూ వెళ్తే 50ఏళ్ల వరకు ఈ జీవిత బీమాను పొందవచ్చు. అయితే దరఖాస్తు చేసే సమయంలోనే ఆటో డెబిట్ ఆప్షన్ ఎంచుకుంటే ప్రతీ ప్రత్యేకంగా రెన్యూవల్ చేసుకోవాల్సిన అవసరం ఉండదు. ప్రతీ ఏడాది మే నెలలో ఆటోమాటిక్ రెన్యూవల్ అవుతుంది. ఈపథకం పొందిన వ్యక్తి ఏవిధంగా మరణించిన రూ.2లక్షల బీమా మొత్తాన్ని నామినీకి అందజేస్తారు.

● వయసుతో సంబంధం లేకుండా జాతీయ బ్యాంకులతో పాటు గ్రామీణ బ్యాంకుల్లో జన్‌ధన్ యోజన ఖాతాలను పొందవచ్చు. ఈఖాతాతో పాటు వచ్చే రూపే ఏటీఎం కార్డుపైన రూ.2లక్షల ప్రమాద బీమా అందుబాటులో ఉంటుంది. అయితే ఈ బీమా పొందాలంటే ఏటీఎం కార్డును ప్రమాదం జరగడానికి ముందు 60రోజుల వ్యవధిలో వినియోగించి ఉండాలి. ఈఖాతాను జీరో ఖాతాగా పిలుస్తారు. ఎలాంటి రుసుం లేకుండా ఈఖాతాను బ్యాంకు శాఖల్లో లేదా సంబంధిత బ్యాంకుల బిజినెస్ కరస్పాండెంట్ల వద్ద పొందవచ్చు. ఆధార్ కార్డుతో పాటు ఒక ఫోన్ తీసుకెళ్తే చాలు ఈ ఖాతాను తెరవచ్చు.

ప్రతీ ఖాతాదారుడు నమోదు చేసుకోవాలి



ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమా యోజన పథకాల్లో సేవింగ్స్ ఖాతా కలిగిన ప్రతీ ఒక్కరు ఈ పథకాలకు నమోదు చేసుకోవాలి. ఈపథకాల్లో చేరితే ప్రమాద వశాత్తు మరణించిన కుటుంబాలకు ఆర్థిక భరోసా ఉంటుంది. వీటిపై అవగాహన కల్పించేందుకు జన్‌సురక్షా పేరిట మూడు నెలల పాటు గ్రామీణ స్థాయిలో ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నాం.

ఏ.తిరుపతి నాయక్, లీడ్ బ్యాంక్ మేనేజర్, భూపాలపల్లి



గుర్తింపు

ఎల్కతుర్తి మండల సమాఖ్య కేంద్రం (ఐకేపీ భవనం)

ఉత్తమ మండల సమాఖ్యగా ఎల్కతుర్తి

» రాష్ట్రం నుంచి జాతీయస్థాయికి ఎంపిక
» హర్షం వ్యక్తం చేసిన మహిళ సంఘాలు

ఎల్కతుర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ పని తీరు కలిగిన ఎల్కతుర్తి మండల ఎస్‌హెచ్‌జీ (మండల మహిళ సమాఖ్య) జాతీయ స్థాయి ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఏపీ మాస్ చైర్మన్ కాకి మాధ వరావు (రిటైర్డు ఐఏఎస్), సీఈవో, ఎండీ సీఎస్ రెడ్డిలు సోమవారం ప్రక టన విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా ఉత్తమ పని తీరు కనబరిచిన ఎస్‌హెచ్‌జీల నుంచి ఏపీ మాస్ (ఆంధ్రప్రదేశ్ మహిళ అభివృద్ధి సంస్థ), ఎస్‌బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా), ఇతర ఏజెన్సీల మద్దతుతో దేశ వ్యాప్తంగా ఆగస్టులో మొదటి విడత, ఈనెల 9న రెండవ విడతలో ఎస్‌హెచ్‌జీ (సెల్ఫ్ హెల్ప్ గ్రూప్) ఫెడరేషన్ల నుంచి 200 నామినేషన్‌లు స్వీకరించారు.

ఇందులో సమాఖ్య పనితీరు, అంది స్తున్న సేవలు, వనరులు, ఆస్తు నిర్వహణ, వాటి నాణ్యత, సమావేశాలు, హాజ రు, రుణ స్వీక రణ, చెల్లింపులు, పొదుపు, సభ్యుల పనితీరు, స్వయం సమృద్ధి సాధనలో సాధించిన లక్ష్యాలను ప్రామాణికంగా ఎంపికలు జరిపారు. ఇందులో ఎల్కతుర్తి ఎస్‌హెచ్‌జీ - 2024 కు భారత దేశం వ్యాప్తంగా మొదటి స్థానంలో ఎంపికైంది. రాష్ట్రంలో మొదటి సారిగా ఎస్‌హెచ్‌జీ ఎంపిక కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డును నవంబరు 22న హైదరాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి సదస్సులో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆర్. స్వర్ణలత అందుకోనున్నట్లు మం డల ఏపీఎం రవీందర్ తెలిపారు. మండల సమాఖ్య పరిధిలో 942 సంఘాలు, 10422 మంది సభ్యులు ఉన్నట్లు రవిందర్ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులను, ఏపీఎం రవిందర్‌ను, వీవోఏలు, సిబ్బంది, సంఘం సభ్యులను కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా ప్రాజెక్టు అధికారి నాగపద్మజా, ఏపీడీ సుధీర్‌కుమార్‌లు అభినందించారు.

తాను పనిచేసే చోటే.. కుమారుడికి అడ్మిషన్

ఆదర్శంగా నిలిచిన ఉపాధ్యాయురాలు



ప్రభుత్వ పాఠశాలలో కుమారుడిని చేర్పిస్తున్న ఉపాధ్యాయురాలు శృతి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తాను విధులు నిర్వహించే సర్కారు బడిలోనే తన కుమారుడిని చేర్పించిన ఆ ఉపాధ్యాయురాలు ఆదర్శంగా నిలిచారు. మహబూబాబాద్‌కు చెందిన గిద్దె శృతి డీఎస్సీ-2024 ద్వారా టీచర్ కొలువుకు ఎంపికై మహబూబాబాద్ మండలం బ్రాహ్మణపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)గా ఇటీవల విధుల్లో చేరారు. ఈ క్రమంలో తన ఐదేళ్ల కుమారుడు సాహస్ అభినందన్‌ను కూడా అదే పాఠశాలలో ఒకటో తరగతిలో చేర్చారు. అంతే కాదు తన కూతురిని కూడా అదే పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించారు. కొత్తగా ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరిన శృతి తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధారావత్ భద్రు, ఉపాధ్యాయులు మౌనిక,సూర్యప్రకాష్, పవన్‌రాజ్, కృష్ణమూర్తి, రాచకొండ ఉపేందర్, బానోత్ శంకర్ పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా..

» తన వంతు కృషి చేస్తున్న ప్రకాశ్
» పాదయాత్రలు, స్వచ్ఛంద కార్యక్రమాలతో చైతన్యం

• ఆదర్శం

కాజీపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడకు ముప్పుకలగకుండా.. పర్యావరణ పరిరక్షణలో 'నేను సైతం' అంటూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు కాజీపేటకు చెందిన కొలిపాక ప్రకాశ్. చెట్లను కాపాడాలని, ప్లాస్టిక్‌ను నిషేధించాలని, చెరువులను కాలుష్యం నుంచి కాపాడాలంటూ అవగాహన కల్పిస్తున్నాడు. చెట్లను నరుకుతూ కనిపిస్తే అడ్డుకుంటాడు. మురికి కుంటలు, చెరువుల్లో ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోయి కనిపిస్తే చాలు వెంటనే అందులోకి దిగి ఆ కవర్లన్నీ ఏరి ఒక కుప్పగా పోసి మునిసిపల్ సిబ్బంది సమాచారం ఇచ్చి అక్కడ నుంచి తరలిస్తాడు. గణపతి నవరాత్రులొస్తే ఖైరతాబాద్ నుంచి ఖమ్మం వరకు వివిధ రకాల వేషధారణతో పాదయత్ర చేసి 'మట్టివినాయకులనే పూజిద్దాం. ఇళ్లలో నిమజ్జనం చేద్దాం - చెరువులను రక్షిద్దాం' అంటూ అవగాహన కల్పిస్తుంటాడు. కాజీపేటకు చెందిన కొలిపాక ప్రకాశ్. ములుగు జిల్లా మంగపేటలో తన బంధువుల ఇంటి వద్ద ఉండి పదో తరగతి వరకు చదువుకున్న ప్రకాశ్ అక్కడి బిల్ట్ పరిశ్రమ నుంచి కాలుష్యం వెలువడటంతో బిల్ట్ యజమానులు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు పెంచేవారు. పాఠశాల స్థాయిలో చేపట్టిన ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న ప్రకాశ్ దృష్టి పర్యావరణ పరిరక్షణపైకి మళ్లింది.

2018లో పాదయాత్రగా ఖైరతాబాద్ వెళ్లి.. గణేష్ విగ్రహ తయారీలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియోగించకుండా పర్యావరణ హితంగా విగ్రహాన్ని రూపొందించాలంటూ ఉత్సవ నిర్వాహకులను కలిసి వినతిపత్రం ఇచ్చాడు. ఆ తర్వాత మేధిని అనే స్వచ్ఛంద సంస్థని స్థాపించి ఖైరతాబాద్ నుంచి ఖమ్మం వరకు పాదయాత్ర చేసి ఇండ్లలోనే నిమజ్జనం చేద్దాం- చెరువులను రక్షిద్దాం అంటూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాడు. వికారాబాద్ జాతీయ రహదారివద్ద వెయ్యి చెట్లను నరికివేయబోతున్నారని తెలిసి వికారాబాద్ వరకు పాదయాత్ర చేసి హైదరాబాద్ నేచర్ లవర్స్, చెన్నై జాతీయ హరిత ట్రైబ్యునల్‌ను ఆశ్రయించి చెట్ల నరికివేతపై స్టే తెచ్చాడు. ప్రతీ రెండు సంవత్సరాలకు మేడారం జాతరకు వెళ్లి ప్లాస్టిక్ వాడొద్దని, చెట్లను నరికొద్దని అవగాహన కల్పిస్తుంటాడు. ఇతని సేవను గుర్తించి పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు ఎన్నో అవార్డులు ఇచ్చాయి.



ప్లాస్టిక్ బాటిళ్లను మెడలో వేసుకుని అవగాహన కల్పిస్తున్న ప్రకాశ్ (ఫైల్)



ప్రకృతిని రక్షించాలని మురికి కుంటలో నిరసన



అన్న హజారేతో ప్రకాశ్ (ఫైల్ ఫొటోలు)

ప్రకృతి విధ్వంసాన్ని అడ్డుకోవాలి

కొలిపాక ప్రకాశ్, పర్యావరణ ప్రేమికుడు



ప్రస్తుతం ప్రకృతి విధ్వంసం ఎక్కువవుతోంది. ఈ విధ్వంసాన్ని అడ్డుకోవాలి. పట్టణీకరణ పెరిగే కొద్ది కాలుష్యం పెరుగుతోంది. ఇదే కొనసాగితే రాబోయే తరాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అందించాలి. అందుకు యువత నడుం బిగించాల్సిన అవసరం ఉంది. తాత్కాలిక అవసరాలకోసం ప్లాస్టిక్‌ను వాడితే భవిష్యత్ గందరగోళం ఏర్పడుతోంది. ప్రభుత్వమే అన్నీ చేయాలంటే ఎలా... ప్రతీ ఒక్కరు పర్యావరణ పరిరక్షణ కోసం ఒక బాధ్యత తీసుకోవాలి. కాలుష్య కోరల్లోంచి బయటపడాలి ముఖ్యంగా దీనిపై యువత చొరవ చూపాలి.

సమన్వయ లోపం..
రోగులకు శాపం

గాడితప్పిన ఎంజీఎం నిర్వహణ ఆర్‌ఎంల అలకతో సమస్య జటిలం

వరంగల్ మెడికల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి నిర్వహణ గాడితప్పిందని, ఆర్‌ఎంవోలకు మినిస్ట్రీరియల్ అధికారులకు మధ్య ఏర్పడిన గ్యాప్ రోగులకు శాపంగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో నిత్యం వందలాది మంది రోగులొచ్చే ఈ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పనలో కూడా పూర్తిగా విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. ఈ మధ్యకాలంలో పరిపాలనపరమైన దస్త్రాలు తమ వద్దకు రావడం లేదన్న కారణంతో ఆర్‌ఎంవోలు అలకబూనారని, విధులు లేని కుర్చీలు తమకెందుకన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ నామమాత్రంగా విధులకు హాజరవుతూ చేతులు దులుపుకుంటున్నారని, ఒక ఆర్‌ఎంవో అయితే జాడ లేకుండా పోయినట్టు సమాచారం. ఫలితంగా వివిధ అవసరాల కోసం వచ్చే రోగులకు శాపంగా మారింది. వివిధ పరీక్షలు ఉచితంగా చేయాలంటే ఆర్‌ఎంవో సంతకాలు అవసరం కాగా గదులన్నీ ఖాళీగా ఉండటంతో ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక రోగులు వెనుతిరుగుతున్నారు. ఇక వివిధ వార్డుల్లో అవసరమయ్యే మౌలిక సదుపాయాల ఇండెట్స్ కూడా ఆర్‌ఎంవోల సంతకాలు తప్పనిసరి అయితే ఎవరూ లేకపోవడంతో ఇంటెండ్ ఇచ్చేందుకు స్టోర్స్ సిబ్బంది నిరాకరిస్తున్నారని ఎంజీఎం నాలుగో తరగతి ఉద్యోగులు నర్సింగ్ సిబ్బంది వాపోతున్నారు.

అసలేం జరిగింది?



ఎంజీఎం మినిస్ట్రీరియల్ అధికారికి వివిధ దస్త్రాలు నేరుగా వెళుతుండగా అక్కడి సూపరింటెండెంట్ కార్యాలయానికి వెళుతున్నాయి. గతంలో ఇలాంటి ఫైళ్లన్నీ ఆర్‌ఎంవో కార్యాలయానికి కూడా వెళ్లేవి కాగా ప్రస్తుతం ఇందుకు విరుద్ధంగా జరగుతుండటం ఆర్‌ఎంవోల అలకకు కారణమైందని తెలుస్తోంది.

మందుల కొనుగోళ్లే కారణమా?

అయితే మందుల కొనుగోలు వ్యవహారంలో ఆర్‌ఎంవోలను పక్కన పెట్టడం కూడా ఈ అంతర్గత గొడవ కారణమైనట్టు తెలుస్తోంది. అదే విధంగా డైట్ కాంట్రాక్టు విషయంలో కూడా బేధాభిప్రాయాలు వ్యక్తమైనట్టు సమాచారం. వీటికి తోడు అమ్యామ్యాల విషయంలో వచ్చిన అపార్థాలు కూడా కారణమేనన్న గుసగుసలు వినిపించడం గమనార్హం.

కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలు కరువు

అధికారులు మధ్య సమన్వయ లోపం కాంట్రాక్టు ఉద్యోగులకు శాపంగా మారింది. కొనసాగింపు ఉత్తర్వులు బడ్జెట్ ఉన్నా ఇంత వరకు జీతాలు ఇవ్వకపోవడం పట్ల కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం తమకు భారంగా మారిందని, ఇప్పటికైనా తమకు జీతాలు చెల్లించాలని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సర్వే విధులు సరే.. భద్రతేదీ?



బేతోలు శివారులో సర్వే చేస్తున్న మల్యాల ఏఈవో సరిత

వారు మహిళా వ్యవసాయ విస్తీర్ణ అధికారులు. నాలుగు రోజులుగా డిజిటల్ క్రాప్ సర్వే జరుగుతున్న నేపథ్యంలో వారు ఇదిగో ఇలా అవస్థలు పడుతున్నారు. సర్వేలో భాగంగా డిజిటల్ యాప్‌లో చూపించిన పొలాలకు, ఇతర ప్రాంతాలకు వెళుతున్నారు. ఈ క్రమంలో కాలినడకన కిలోమీటర్ల కొద్దీ గుట్టలు, పుట్టలు, ముళ్ల కంచెలు, చెట్ల పొదలను దాటుతున్నారు. ఆ సమయంలో ఎన్నో అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇక ఆయా ప్రాంతాల్లో సెల్ నెట్‌వర్క్‌లు సరిగ్గా ఉండకపోవడంతో డిజిటల్ యాప్ సక్రమంగా పనిచేయక, గ్రామ సమాచారం ఓపెన్ కావడానికి ఆలస్యమవుతోంది. కొన్ని సందర్భాల్లో యాప్‌లో చూపించిన విధంగా ఒక పొలం వద్దకు వెళ్తే.. ఇంకా చేరుకోనట్టు చూపుతుండటం, ఒక సర్వే నెంబర్ వద్ద ఇతర రైతుల వివరాలు చూపించడం, రైతు ఫొటోలు తీసిన తర్వాత సబ్‌మీట్ కావడానికి ఆలస్యం జరుగుతోంది. దీంతో అవస్థలు ఎదుర్కొంటున్న ఏఈవోలు.. తాము కిలోమీటర్ల కొద్ది గుట్టలు, పుట్టల మధ్య ఒంటరిగా వెళ్లాల్సి వస్తోందని, ఏ సమయంలో ఏ ఆపద ముంచుకోస్తుందోనని, తమకు భద్రత ఏదీ అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

\- మహబూబాబాద్ అగ్రికల్చర్

ఏటిగడ్డతండాలో కంచెల మధ్య సర్వే చేస్తున్న ఏఈవో లావణ్య





చెట్ల మధ్య రజాలీపేటలో సర్వేకు వెళ్తున్న మహబూబాబాద్ ఏఈవో

అక్రమ పట్టాల కేసులో చర్యలేవీ?

» యజమాని బతికుండగానే చనిపోయినట్టు ధ్రువీకరణ
» భూమిని ఇతరులకు పట్టాచేసిన తహసీల్దార్
» పోలీసు కేసుతోనే సరి.. కానరాని శాఖాపర చర్యలు

పర్వతగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మనిషి బతికుండగానే చనిపోయినట్లు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఆయన భూమిని ఇతరులకు బదలాయించారు. దర్జాగా పట్టాలు చేసి అందినకాడికి దండుకున్నారు. ఆలస్యంగా తెలుసుకున్న భూ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు. ఏకంగా తహసీల్దారే ఇలాంటి చర్యకు ఒడిగట్టినా శాఖాపరంగా తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం. తహసీల్దార్ చొరవతోనే ఇదంతా జరిగిందని స్పష్టంగా అర్థమవుతున్నా చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అయితే ఈ ఒక్క డీల్‌తో లక్షల్లో చేతులు మారాయని చర్చ జరుగుతుండగా.. సదరు తహసీల్దార్ హయాంలో ఇలాంటి ఘటనలు మరెన్ని జరిగాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క అఫిడవిట్ ఆధారంగా పట్టా చేశారు..

మండలంలోని ఒక గ్రామానికి చెందిన వ్యక్తి బతికుండగానే చనిపోయాడని ధ్రువీకరణ చేసి మరీ అతని భూమిని ఇతరులకు బదలాయించారు. ఒకవేళ రైతు మృతి చెందితే అతనికి సంబంధించిన భూమిని వారసులకు బదిలీ చేయాలంటే రైతు మరణ ధ్రువీకరణ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, ఒరిజినల్ పట్టా దార్ పాస్‌బుక్ అవసరం. కానీ ఇక్కడ అవేవీ లేకుండానే కేవలం రెండు పేజీల లాయర్ అఫిడవిట్ ఆధారంగా ఏకంగా ఎకరం భూమిని ఇతరులకు అక్రమంగా పట్టాచేశారు. కొందరు దళారుల ప్రోద్బలంతో లక్షలు చేతులు మారడంతో పట్టాలు మారాయని మండలం మొత్తం కోడైకూస్తోంది.

రైతు ఫిర్యాదుతో కేసు నమోదు

రుణమాఫీకి సంబంధించి తనకు ఎలాంటి సమాచారం అందకపోవడంతో తాను రుణం తీసుకున్న బ్యాంకుకు వెళ్లి సదరు రైతు ఆరా తీశాడు. దీంతో బ్యాంకు అధికారులు అతడి పేరుపై భూమి లేదని, ఇతరులకు విక్రయించినట్టు రికార్డుల్లో ఉందని చెప్పడంతో అవాక్కయ్యాడు. వెంటనే రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి తనకు చెందిన పత్రాలతో సంప్రదించాడు. తాను బతికుండగానే చనిపోయినట్టు ధ్రువీకరణ సృష్టించి తన భూమి తనకు తెలియకుండానే అధికారులు ఇతరులకు పట్టాచేశారని తెలుసుకుని పోలీసులతో పాటు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.



పర్వతగిరి తహసీల్దార్ కార్యాలయం

చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు..

బతికున్న మనిషిని చనిపోయాడని ధ్రువీకరించి అతని భూమిని ఇతరులకు పట్టా చేసిన తహసీల్దార్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమంగా పట్టా చేసిన అనంతరం తహసీల్దార్ ఇతర మండలానికి బదిలీపై వెళ్లారు. బదిలీపై వెళ్లిన కొన్ని రోజులకు విషయం వెలుగులోకి వచ్చింది. రైతు ఫిర్యాదుతో స్టేషన్‌లో కేసు నమోదైంది కానీ, ఇది జరిగి రెండు నెలలు గడుస్తున్నా రెవెన్యూ ఉన్నతాధికారుల వైపు నుంచి ఎలాంటి శాఖాపరమైన చర్యలు కనబడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సదరు తహసీల్దార్ హైదరాబాద్ స్థాయిలో పలువురు అధికారులను ప్రభావితం చేసి దర్జాగా తన విధులు నిర్వర్తిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆ తహసీల్దార్ హయాంలో మరెన్ని అక్రమాలకు పాల్పడ్డారోనని మండలంలో చర్చ సాగుతోంది. ఎప్పుడు ఇలాంటి ఏ ఘటన బయటికి వస్తుందోనని రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పటికైనా ఇలాంటి అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు డిమాండ్‌చేస్తున్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు ఇవ్వాలి

ఇనుగుర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు డీఏ, పీఆర్‌సీ, పెండింగ్ బిల్లులు ఇవ్వాలని కోరుతూ టీపీయూఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఇనుగుర్తి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాగి సోమనర్సయ్యాచారి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన ఐదు డీఏలను, పెండింగ్ డీఏ, పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సామల రమేష్, జిల్లా కోశాధికారి బాలరాజు పాల్గొన్నారు.

పత్తిపాక బడికి భవనం మంజూరు చేయాలి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మునిసిపల్ 20వ వార్డు పరిధిలోని పత్తిపాకలో ఎంపీపీఎస్ భవనం శిథిలావస్థకు చేరుకున్నందున నూతన భవనాన్ని మంజూరు చేయాలని పత్తిపాక వాసులు సిరిపురం వీరన్న, మహేందర్, లాలయ్య విజ్ఞప్తి చేశారు. ఈమేరకు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పత్తిపాకలోని ప్రాథమిక పాఠశాలలో నిరుపేద విద్యార్థులు 50మంది విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో రవి, యాకన్న, రాజయ్య, శంకర్, కృష్ణ, అజయ్, పరమేష్, పాషా పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

కేసముద్రం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కేసముద్రం మార్కెట్ పరిధిలో భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు బొబ్బాల యాకూబ్‌రెడ్డి, పార్టీ మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న మాట్లాడుతూ మార్కెట్‌లో ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువగా ధరలు ఉన్నాయని తెలిపారు. చైర్మన్ వెంట ప్రత్యేక హోదా కార్యదర్శి కోలా అమరలింగేశ్వర్‌రావు ఉండగా కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు మార్తినేని పాపారావు, అల్బుగొండ సావిత్ర, నీరుటి జలేందర్, చందా వెంకన్న, జల్లె జయరాజ్ పాల్గొన్నారు.

టీడీపీ మానుకోట పార్లమెంట్ కన్వీనర్‌గా రాంచందర్‌రావు



నెహ్రూసెంటర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మహబూబాబాద్ పార్లమెంట్ అడ్‌హాక్ కమిటీ కన్వీనర్‌గా కొండపల్లి రాంచందర్‌రావును నియమించినట్లు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు సోమవారం ప్రకటన విడుదల చేశారు. రాంచందర్‌రావు గతంలో టీడీపీ మహబూబాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడిగా కొనసాగారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వనమోదు కార్యక్రమం ఉన్నందున విజయవంతం చేయడానికి అడ్‌హాక్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తిరిగి రెండోసారి మహబూబాబాద్ పార్లమెంట్ అడ్‌హాక్ కన్వీనర్‌గా రాంచందర్‌రావు నియమితులయ్యారు. తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ బాధ్యతను వమ్ము చేయనని రాంచందర్‌రావు తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకులు, ఏపీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

గౌరవ వేతనం రూ.5వేలు అందించాలి



ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న రేషన్ డీలర్లు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లకు ప్రతి నెల గౌరవ వేతనం రూ.5వేలు అందించడంతో పాటు క్వింటాకు కమీషన్‌ను రూ.300లకు పెంచి ఇవ్వాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కుంభం యాదగిరిగౌడ్ అన్నారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ... ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా జనవరి 2025 నుంచి సన్న బియ్యం ఇవ్వనున్నట్లు రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, బిర్రు వెంకటనారాయణ, ముంజాల యాకయ్య, రాంచందర్‌రావు, శంకర్ నాయక్, వేణుగోపాల్, బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఓంకార్ ఆశయాల సాధనకు పోరాడాలి

కేసముద్రం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దివంగత నర్సంపేట ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ ఆశయాలను సాధించేందుకు ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి పిలుపునిచ్చారు. ఓంకార్ 16వ వర్ధంతి పక్షోత్సవాల సందర్భంగా కేసముద్రంలో ఆపార్టీ ఆధ్వర్యంలో సోమవారం 'ప్రస్తుత రాజకీయాలు, మార్క్సిజం, అంబేద్కర్ ఆలోచనా విధానాలపై' సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రజా సంక్షేమం ముసుగులో దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు నూకల ఉపేందర్, కె.బాబురావు, ఈసం రామయ్య, గుండగాని సత్తయ్య, కటకం బుచ్చిరామయ్య, సీతారాములు, వేల్పుల వెంకన్న, ఎ.రమేష్ పాల్గొన్నారు.

1 నుంచి గడప గడపకు కాంగ్రెస్

డోర్నకల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్ మునిసిపల్ పరిధిలో నవంబరు 1 నుంచి 10 వరకు గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కాల సుమీర్‌చందజైన్ తెలిపారు. సోమవారం డోర్నకల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రతి కాంగ్రెస్ కార్యకర్త గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ వారి నుంచి వ్యక్తిగత, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజాసేకరణ చేయాలని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాద శ్రీనివాస్, శీలం శ్రీనివాస్, ఎల్లావుల హరికృష్ణ, రెడ్డబోయిన శంకర్, రమేష్‌నాయక్, మహేష్, భద్రునాయక్, దారావత్ కృష్ణ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది : ఎస్సై

కురవి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో యువతలో స్నేహభావం పెంపొందుతుందని ఎస్సై గండ్రాతి సతీష్ అన్నారు. కురవి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ ముగింపు సభలో ఆయన మాట్లాడారు. యువత క్రీడల్లో రాణిస్తూ చదువును అశ్రద్ధ చేయొద్దని సూచించారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను వెలికితీసి పరిష్కరించడంలో యువత ముందుండాలన్నారు. టోర్నీలో ప్రథమ బహుమతి గెలిచిన కురవి లెవన్, ద్వితీయ బహుమతి పొందిన వీరభద్ర లెవన్ జట్లకు ఎస్సై బహుమతులు అందించారు.

వారంలో మొక్కలు నాటాలి

- లేకుంటే డబ్బులు రికవరీ చేయిస్తాం
- ప్రజావేదికలో అదనపు డీఆర్‌డీవో శాంతకుమారి



కొత్తగూడలో అధికారి ముందే వాగ్వాదం చేసుకుంటున్న ఏపీవో, టీఏ

కొత్తగూడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడలో సోమవారం ఉపాధి హామీ 14వ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ప్రజా వేదికకు అదనపు డీఆర్‌డీవో శాంతకుమారి హాజరయ్యారు. సామాజిక తనిఖీ బృందం జంగవానిగూడెం, దుర్గారం, సాధిరెడ్డిపల్లి, గుంజేడు, ఓటాయి, గోవిందాపురం, బత్తులపల్లి, రామన్నగూడెం తండా, చెరువుముందు తండా, గుండం గ్రామాలలో సేకరించిన సమాచారాన్ని ప్రజా వేదికలో చదివి వినిపించారు. హరితహరంలో నాటిన మొత్తం మొక్కలు లేవని గుర్తించి వివరించారు. వారంలో మొక్కలు నాటి ఫొటోలు చూపించాలని లేకుంటే వారం తర్వాత దుర్వినియోగం అయిన డబ్బులను ఎంపీడీవో, ఏపీవో, టీఏ, ఈసీ, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి రికవరీ చేయిస్తామని అదనపు డీఆర్‌డీవో శాంతకుమారి హెచ్చరించారు. ఉపాధి హామీ పథకంలో పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్య వైఖరిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. మస్టర్‌లలో కార్యదర్శులు సంతకాలు పెట్టడం లేదని తనిఖీ బృందం వివరించగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అది కూడా మీపనేనని గుర్తు చేశారు. ఉపాధి పనులు జరిగేటప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. మొక్కలను రక్షించడంలో కార్యదర్శులు నిర్లక్ష్యం వీడాలన్నారు. లేనట్లయితే జరిమానా తప్పదన్నారు.

ఏపీవోపై ఆగ్రహం..

పాస్ ఆర్డర్లు లేకుండా పేమెంట్‌లు అయ్యాయని, కొన్ని గ్రామాల్లో మస్టర్‌లలో ఏపీవో సంతకాలు లేవని తనిఖీ బృందం గుర్తించగా ఏపీవో భీమ్లానాయక్‌పై అదనపు డీఆర్‌డీవో శాంతకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్‌లలో మెసేజ్‌లు పెట్టడం కాదు.. ముందు మీ పని చేయండని అన్నారు. గుంజేడులో ఓ పనికి ఎంబీ రికార్డు అయిన మస్టర్‌లు లేవని, తనిఖీ బృందానికి ఇవ్వలేదని, కూలీలకు డబ్బులు పడలేదని బృందం పేర్కొనగా ఏపీవో భీమ్లానాయక్, టీఏ రాధికను ప్రశ్నించారు. అధికారుల ముందే ఏపీవో, టీఏ వాగ్వాదం చేసుకున్నారు. పనిచేసిన కూలీ డబ్బులు రాని వారికి వారం రోజుల్లో డబ్బులు వేయాలని ఆదేశించారు.

పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో చేపట్టిన పనుల రికార్డులను పంచాయతీరాజ్ శాఖ ఏఈ సామాజిక తనిఖీ బృందానికి ఇవ్వలేదని వారు ఆరోపించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని అదనపు డీఆర్‌డీవో పేర్కొన్నారు. మండలంలోని ఓటాయిలో సీసీ రోడ్డు పనులు చేయకున్నా చేసినట్టు రికార్డు చేశారని గ్రామస్తులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తనిఖీ బృందం పేర్కొన్నారు. ఆ రోడ్డుపై క్వాలిటీ కంట్రోల్ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు ఆమె పేర్కొన్నారు. సాధిరెడ్డిపల్లిలో అడవిలో చేసిన పనిని కూడా క్వాలిటీ కంట్రోల్ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు చెప్పారు. ప్రజావేదికలో జిల్లా అంబుడ్స్‌మెన్ ఆదాం, ఎస్ఆర్పీ కొమురయ్య, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

చెడు ఆలోచనలకు తావివ్వొద్దు : షీటీమ్ ఎస్సై

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చదువుకునే సమయంలో చెడు ఆలోచనలకు తావివ్వొద్దని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి వివరాలు చెప్పవద్దని మహబూబాబాద్ ఉమెన్ సెల్, షీటీమ్ ఎస్సై సునంద అన్నారు. మహబూబాబాద్‌లోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల డిగ్రీ కళాశాలలో సోమవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఎస్సై సునంద మాట్లాడుతూ.. ప్రస్తుత ఆధునిక సమాజంలో సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్‌లోని యాప్‌లలో ఫొటోలు పెట్టవద్దని, వాటిని మార్ఫింగ్ చేసే ప్రమాదం ఉందని చెప్పారు. విద్యార్థినులు అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసుల్లా, భరోసా కోఆర్డినేటర్ జోత్స్న, షీటీమ్ సిబ్బంది అరుణ, పార్వతి, రమేష్, జయశ్రీ పాల్గొన్నారు.

ఐదు రూపాయల నాణేలతో చిన్నారి బర్త్ డే



మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్ల పట్టడం ద్వారా సాక్షాత్తు లక్ష్మీదేవే తమ ఇంటికి వచ్చిందని భావించిన ఆ కుటుంబం మొదటి నెల బర్త్‌డేను సోమవారం వినూత్నంగా నిర్వహించారు. మహబూబాబాద్ పట్టణంలోని కృష్ణకాలనీకి చెందిన వెల్దే ప్రశాంత్, వర్ష దంపతులకు తొలి సంతానంగా నెల రోజుల క్రితం ఆడ శిశువు జన్మించగా ఆ చిన్నారికి శాన్వి అని నామకరణం చేశారు. తమ ఇంట లక్ష్మీదేవి జన్మించిందని భావించి ఇంటిని పూలతో అలంకరించారు. తల్లిదండ్రులు పాపను చాపపై పడుకోబెట్టి పక్కన రూ.లక్ష విలువ చేసే ఐదు రూపాయల నాణేలు ఒకటవ సంఖ్య రూపంలో పేర్చి వేడుకలను నిర్వహించారు.

ఐక్యతతోనే బీసీలకు రాజ్యాధికారం

మరిపెడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బీసీల ఐక్యతతోనే బీసీలకు రాజ్యాధికారం సిద్ధిస్తుందని బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు గండి వీరేందర్ అన్నారు. సోమవారం మరిపెడలోని కుమ్మరి సంక్షేమ భవన్‌లో ఆ సంఘం అధ్యక్షుడు ఉమేశ్ చందర్ అధ్యక్షతన జరిగిన సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అతి కొద్దిగా ఉన్న అగ్రకులాల వారు రాజ్యాధికారం చేజిక్కుంచుకొని బీసీ కులాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధిపొందుతున్నట్లు గుర్తు చేశారు. అనంతరం మరిపెడ సంఘ బాధ్యులను ఆయన నియమించారు. సమావేశంలో శామకూరి కృష్ణ, హరికృష్ణ, ముస్తాఫా, శ్రవణ్, సాయికుమార్, సాయి, బింగి రమేశ్, వెంకటేశ్వర్లు, నలబోతు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన చాంబర్ కార్యవర్గ సభ్యులు

తొర్రూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం సోమవారం పట్టణంలోని చాంబర్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో నూతన కార్యవర్గ సభ్యులు గెలుపొందారు. ఎన్నికల కమిటీ కన్వీనర్‌గా పంజాల ఉపేందర్ వ్యవహరించారు. చాంబర్ ఆఫ్ కామర్స్‌లో 395 మంది వ్యాపారులు ఓటర్లుగా ఉండగా, ఎలక్షన్లను ఉదయం 7 గంటల నుండి 1 గంట వరకు నిర్వహించిన 372 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షులుగా పోటీ చేసిన వారిలో బిజ్జాల అశోక్‌పై మచ్చ సురేష్ 275 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కార్యదర్శిగా తల్లాడ హీరాధర్, కోశాధికారిగా చిదిరాల శ్రీనివాస్ గెలుపొందారు. వీరు 2024-26 సంవత్సరానికి పాలక వర్గ సభ్యులుగా ఉంటారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మచ్చ సురేష్ మాట్లాడుతూ అన్ని వర్గాల వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు గోపారపు నాగేశ్వర్‌రావు, నర్సయ్య, శ్రీను, సోమేశ్వర్‌రావు, ఉమ, అనిల్ తదితరులు ఉన్నారు.

ఎల్లంపేట వీవోఏపై విచారణ

- చేయి చేసుకున్న వైరి వర్గాలు

మరిపెడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లంపేట వీవోఏ మోహర్నిషాపై ఆ గ్రామానికి చెందిన కొందరు డ్వాక్రా మహిళలు అవినీతి ఆరోపణలు చేయగా, సోమవారం ఐకేపీ డీపీఎం శ్రీనివాస్ మరిపెడ స్త్రీశక్తి భవన్‌లో విచారణ జరిపారు. పలు మహిళా సంఘాలకు చెందిన బాధ్యులు కొందరు వీవోఏకు అనుకూలంగా, మరికొందరు ప్రతికూలంగా ఫిర్యాదులు చేశారు. డీపీఎం శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు ఆయన తెలిపారు. వీవోఏపై ఆరోపణలు రుజువైతే చర్యలు ఉంటాయన్నారు. కాగా, వీవోఏకు అనుకూల వర్గాలు, వ్యతిరేక వర్గాల వారు స్త్రీశక్తి భవన్‌కు చేరుకోగా, వారి మధ్య మాటమాట పెరిగి ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారు. మరిపెడ అదనపు ఎస్సై సంతోశ్ చేరుకొని ఇరు వర్గాలను సముదాయించి పంపించారు. ఏపీఎం రాములు, సీసీలు ఉన్నారు.

రెండో దఫా పాఠ్యపుస్తకాల పంపిణీ

ఇనుగుర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 24 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 762 మంది విద్యార్థులకు రెండో దఫా పాఠ్యపుస్తకాలను సోమవారం ఎంఈవో రూపారాణి హెచ్ఎంలకు అందజేశారు. మొదటి దఫాలో పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాల సిలబస్ పూర్తి కావస్తుండడంతో ప్రభుత్వం నుంచి సరఫరా అయిన వివిధ విషయాలకు చెందిన రెండో దఫా పుస్తకాలను అందజేసినట్లు ఎంఈవో తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

డోర్నకల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్ మండలం తోడేళ్లగూడెంకు చెందిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్సై వంశీధర్ తెలిపిన ప్రకారం.... తోడేళ్లగూడెంకు చెందిన గాలి కేశవులు(61) గ్రామంలో చిరు వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 10న టిఫిన్ సెంటర్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో మంటలు అంటుకోవడంతో కేశవులుకు తీవ్ర గాయాలు కాగా, ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని, కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కేశవులు మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని వివేకానంద సెంటర్‌లో సోమవారం సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఘనంగా పొంగులేటి జన్మదిన వేడుకలు

గార్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం గార్ల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేర్వేరుగా ఘనంగా జరిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సురపురెడ్డి వెంకట్‌రెడ్డి, టీపీసీసీ మాజీ కమిటీ సభ్యులు రావూరి వెంకట్రామయ్య నాయకత్వంలో జన్మదిన కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు, అనంతరం బాణసంచాకాల్చి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుండా వెంకట్‌రెడ్డి, తాళ్లపల్లి కృష్ణాగౌడ్, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్ శంషాద్ బేగం, హతీరాం నాయక్, దనియాకుల రామారావు, బాపన పల్లి సుందర్, బాబు పాల్గొన్నారు.

- మరిపెడ: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ హైదరాబాద్‌లో పొంగులేటిని కలుసుకున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ తదితరులు ఉన్నారు.



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్‌టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం(టీకేజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ.రమణ డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సోమవారం టీకేజీకేఎస్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని కోరారు. ప్రతి సొసైటీకి పది ఎకరాల భూమి ఇవ్వాలని, ప్రతి జిల్లా కేంద్రంలో నీరా ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని, సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని నెలకొల్పాలన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు నిరంతరం పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. గీత కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలని, ప్రతి సొసైటీకి కమ్యూనిటీ హాల్ నిర్మించాలన్నారు. అలాగే నవంబరు 19న సీరోలు మండలకేంద్రంలో జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి గౌని వెంకన్న, గునిగంటి మోహన్, మోడెం వెంకటేశ్వర్లు, వీరస్వామి, ఉప్పలయ్య, వెంకన్న, శ్రీకాంత్, రామన్న, యాకన్న, శ్రీనివాస్, సోమయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన

దంతాలపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సోమవారం లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం కింద ఇటీవల చేసుకున్న దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యదర్శి ఏశబోయిన వెంకన్న ఆధ్వర్యంలో 2020లో రూ.వేయితో చేసుకున్న ఇంటి స్థలాల దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. మండలకేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని వెంకన్న హెచ్చరించారు.

బోనస్ ప్రకటించాలి

నెల్లికుదురు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు రూ.500 బోనస్ ప్రకటించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజంపెల్లి వీరన్న అన్నారు. ప్రభుత్వం బోనస్ పెంచాలని కోరుతూ గిర్దావర్ అబ్దుల్ రేహమాన్‌కు సోమవారం వినతి పత్రం అందిజేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బండపెల్లి వెంకటేశ్వర్లు, జక్కుల యాకయ్య, ఈర్ల వెంకన్న, కావటి రమేష్, మోష, కేశవులు, రామోజీ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు 30 చివరి తేది

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకునేందుకు ఈనెల 30 చివరి తేది అని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి సోమవారం తెలిపారు. వివిధ గ్రేడుల్లో చేరేందుకు 10వ తరగతి ఉత్తీర్ణులై 01-08-2024 నాటికి 14 సంవత్సరాలు నిండిన విద్యార్థులు అర్హులన్నారు. గత కౌన్సిలింగ్‌లో సీట్లు రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. వివరాలకుhttp.//iti.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లతో ఈ నెల 30న మధ్యాహ్నం 3 గంటలకు కోరుకున్న ఐటీఐ కళాశాలల్లో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

డీఎస్పీగా క్రిష్ణకిషోర్

తొర్రూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు డీఎస్పీగా టి.కృష్ణకిషోర్ సోమవారం బాధ్యతలుస్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సురేష్ డీజీపీ కార్యాలయానికి బదిలీపై వెళ్లగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న కృష్ణకిషోర్ బదిలీపై తొర్రూరుకు వచ్చారు. ఎస్పీ రాంనాథ్ కేకన్‌ను జిల్లా కేంద్రంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

డీఏ ప్రకటన అసంతృప్తికరం

పెద్దవంగర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఐదు వాయిదాల కరువు భత్యం(డీఏ) పెండింగ్‌లో ఉండగా ఒక్క డీఏ మాత్రమే విడుదల చేయడం అసంతృప్తిని మిగిల్చిందని యూటీఎఫ్ జిల్లా నాయకుడు ఎర్ర వెంకన్న సోమవారం తెలిపారు. ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో మూడు వాయిదాల డీఏ ఒకేసారి విడుదల చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని అన్నారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ నాయకులు చంద్రగిరి ప్రభాకర్, స్రవంతి, రవికుమార్, నరేష్, సైదమ్మ, మున్నీ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి

దంతాలపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) గ్రామ పంచాయతీలో పనిచేసే కార్యదర్శులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీవో మహ్మద్ అఫ్జర్ పాషా అన్నారు. సోమవారం ఆయన మండలంలోని గున్నేపల్లి, తూర్పుతండా గ్రామాల్లో పర్యటించారు. గున్నేపల్లిలో జీపీ రికార్డులను పరిశీలించారు. రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వార్డులో మార్పులు, చేర్పులకై అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోవాలి

మరిపెడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మరిపెడలోని విద్యా హెర్బ్స్ వదులుతున్న విష వాయువులతో ప్రజల ప్రాణాలకు పెను ప్రమాదం పొంచి ఉందని కాంగ్రెస్ నేత అజీజ్ ఆరోపించారు. సోమవారం మరిపెడ గ్రామస్తులు ఫ్యాక్టరీ దగ్గర ఆందోళన చేయగా అజీజ్ పాల్గొని మాట్లాడారు. ఈ ఫ్యాక్టరీ ద్వారా వ్యాపించే విషవాయులు మానవాళితో పాటు పశు, పక్ష సంపదకు సైతం తీరని వేదన మిగులుస్తుందని వాపోయారు. ఫ్యాక్టరీ ప్రతినిధులు ఆందోళనకారులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

గంగారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడగూడెం నుంచి సోమవారం రాత్రి వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గ్రామస్తులు గంగారం సెంటర్‌లో పట్టుకున్నారు. వీటి విలువ రూ.లక్ష వరకు ఉంటొచ్చని అంచనా. పందెం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ గిరిజనుల నుంచి తక్కువరేటుకు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి ఇల్లందు రైస్ మిల్లర్లకు రూ.30 వరకు విక్రయిస్తున్నట్టు సమాచారం. వాహనంతో పాటు డ్రైవర్ వివరాలను ఎస్ఐ రవికుమార్ సేకరించినట్లు తెలిసింది.

2న సామాజిక వర్గాల విశ్లేషణ సర్వేపై సదస్సు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 28: హనుమకొండ కలెక్టరేట్‌లో నవంబరు 2న సామాజిక వర్గాల విశ్లేషణ సర్వేపై సమావేశం ఉంటుందని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి తెలిపారు. మహబూబాబాద్‌లోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో అన్ని సామాజిక వర్గాల విశ్లేషణపై సోమవారం కుల సంఘాల నాయకులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నర్సింహస్వామి మాట్లాడుతూ... నవంబరు 2న హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించబోయే సమావేశంలో కులాల వారీగా సమస్యలు, రాజకీయ, సామాజిక, ఆర్థిక పరమైన అభ్యర్థనలు, సలహాలు స్వీకరించబడతాయని తెలిపారు. ఆక్షేపణలను కమిషన్ చైర్మన్ లేదా సభ్య కార్యదర్శి పేరిట బహిరంగ విచారణ రోజున 6 సెట్ల కాపీలతో పాటు అఫిడవిట్ (రూ.20 నాన్ జ్యూడీషియల్ స్టాంపు పేపరుపై) సమర్పించాలని సూచించారు. సదస్సులో గండి వీరేందర్‌గౌడ్, గందసిరి వేణు, సమ్మెట వెంకన్న, జెర్రిపోతుల వెంకన్న, రాజేందర్, సీతయ్య, శంతన్‌రామరాజు, పరికిపండ్ల అశోక్, విజయలక్ష్మీ, వెంకటేశ్వర్లు, సతీష్, సోమన్న, శేఖర్, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ నాగవాణి పాల్గొన్నారు.

మానుకోటకు మరో అర్బన్ పార్కు

5వ పేజీ తరువాయి



అర్బన్ పార్కులో ఏర్పాటు చేయనున్న వసతుల ఊహా చిత్రం

లక్నవరంను సుందరంగా తీర్చిదిద్దిన ఇంజనీర్లు మహబూబాబాద్‌కు నూతనంగా మంజూరైన అర్బన్ పార్కు డిజైన్‌ను రూపొందించనున్నారు. ఆహ్లాదకరంగా, అత్యాధునిక హంగులతో సుందరీకరించడానికి అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. గతంలో మంజూరు అయిన జమాండ్లపల్లి వద్ద ఉన్న నందనవనంలో ఉన్న వసతులు కాకుండా పర్యాటకులను ఆకర్షించేలా ఉండాలని అధికారులు అంచనాలు వేస్తున్నారు. త్వరలోనే మాను కోట జిల్లాలో అర్బన్ పార్కు స్థలాన్ని పరిశీలించి వారి డిజైన్‌ను ఊహా చిత్రం ద్వారా చెప్పనున్నారు.

ఓబీసీ రిజర్వేషన్ల రద్దుకు కుట్ర

5వ పేజీ తరువాయి

పోరాటానికైనా సిద్ధమని అన్నారు. భవిష్యత్తు కార్యాచరణ కోసం త్వరలోనే రౌండ్ టేబుల్ సమావేశం జరుపనున్నట్టు తెలిపారు. గవర్నర్‌ను, ముఖ్యమంత్రిని, ఆయా నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులను కలిసి వినితిపత్రాలను ఇస్తాన్నారు. బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ.. అంబేద్కర్, పూలే ఆశయ సాధనలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఓసీలలో ఉన్న వివిధ కుల కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని, విధి విధానాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ చైర్మన్‌తో పాటు పాలకవర్గాలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. బ్రాహ్మణ సంఘం ప్రతినిధి వెన్నంపల్లి జనన్మోహన శర్మ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓసీ రిజర్వేషన్ల విషయంలో, అలాగే మరోసారి రిజర్వేషన్ల అమలు తీరుపై అధ్యయనం చేయడానికి ఒక కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

ఈ సమావేశంలో రెడ్డి కుల సంఘం ప్రతినిధులు రాదారపు సంజీవ రెడ్డి, ముదిగంటి వెంకట్‌రెడ్డి, కట్కూరి హనుమంత రెడ్డి, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఏవీ సత్యమోహన్, జీవీఎస్ శ్రీనివాసాచార్యులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు వంగేటి అశోక్, దుబ్బ శ్రీనివాస్, చకిలం రాజేశ్వర్‌రావు, శ్రీనివాసశర్మ, అర్జుల కిషన్‌రెడ్డి, రావుల నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఓబీసీ సంఘాల నాయకులు సమావేశం అయ్యారు. ఓబీసీ రిజర్వేషన్ల రద్దుకు జరుగుతున్న కుట్రను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ఉద్యమంపై భవిష్యత్ కార్యాచరణను రూపొందించారు. తమ హక్కుల పరిరక్షణకు ఓబీసీ సంఘాలు సంఘటితంగా పోరాడాలని కోరుతూ సమావేశం తీర్మానించింది. త్వరలో అన్ని ఓబీసీ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని కోరుతూ మరో తీర్మానం చేసింది.